లష్కారు జోరు

• పజ్జన్నకు దక్కిన హ్యాట్రిక్ • 45240 మెజారిటీతో విజయం • సంబురాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ విజయంతో సరికొత్త రికార్డు నమోదైంది. సికింద్రాబాద్ నియోజకవర్గం ఆవిర్భవించిన నాటి నుంచి ఇప్పటి వరకు ఏ పార్టీ అభ్యర్థి కూడా మూడు వరుస విజయాలు సాధించిన దాఖలాలు లేవు. రెండు వరుస విజయాలు సాధించిన కే.సత్యనారాయణ, ఎల్ నారాయణ, తలసాని శ్రీనివాస్ యాదవ్ వంటి నాయకులు ఈ నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేలుగా గెలుపొంది మంత్రులుగా పని చేసినప్పటికీ హ్యాట్రిక్ దక్కించుకోలేకపోయారు. తాజాగా మూడోసారి వరుసగా ఎన్నికల బరిలో నిలిచిన బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ మరో మారు భారీ విజయం సాధించి ఈ నియోజకవర్గం నుంచి మూడో విజయం సాధించిన తొలి ఎమ్మెల్యేగా రికార్డును సొంతం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం



సర్టిఫికెట్ చూపిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

ఏర్పాటు తర్వాత 2014 శాసనసభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన పద్మారావు గౌడ్ అప్పటి టీడీపీ అభ్యర్థి కూన వెంకటేష్ గౌడ్‌పై గెలుపొందారు. 2018 లో జరిగిన ఎన్నికల్లో ఎన్నికల బరిలో దిగిన పద్మారావుగౌడ్ కాంగ్రెస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌పై గెలుపొందారు. తాజా శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్ కుమార్‌పై 45240 ఓట్ల భారీ మెజారిటీతో హ్యాట్రిక్ చేజిక్కించుకున్నారు.

పనిచేయని స్థానికత..

అధికార పార్టీ పనితీరుపై వ్యతిరేకత, సిట్టింగ్ ఎమ్మెల్యే వైఫల్యాలు తమను గెలిపించి తీరుతాయన్న ధీమాతో ఉన్న లష్కర్ కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు ఈ ఎన్నికల్లో తీవ్ర నిరాశ మిగిలింది. బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ స్థానికేతరుడని, ఇరు పార్టీల నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. డబుల్ బెడ్రూమ్ తదితర విషయాల్లో పద్మారావుగౌడ్ వైఫల్యాలు ప్రజలు గమనించాలంటూ ప్రచారం చేశారు. ఈ మారు సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన స్థానికులమైన తమకు పార్టీ టికెట్లు దక్కాయని చెబుతూనే ఇరు పార్టీల నాయకులు ఓటర్లను ప్రసన్నం చేసుకుని తమను గెలిపించాలని కోరినా లష్కర్ ఓటర్లు మాత్రం పద్మారావుకే భారీ మెజార్టీ ఇచ్చారు.

ప్రతీ రౌండ్ ఆధిక్యమే..

రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ హవా కొనసాగుతున్నప్పటికీ సికింద్రాబాద్ నియోజకవర్గంలో మాత్రం బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు ఈ మారు కూడా భారీ మెజారిటీ లభించింది. తాజా ప్రతికూల పరిస్థితుల్లోనూ గత మెజారిటీ ఎంతమాత్రం తగ్గలేదు. ఉదయం 9 గంటలకు మొదటి రౌండ్‌లో 3931 మెజారిటీ మొదలు చివరగా 16వ రౌండ్ వరకు అన్ని రౌండ్‌లలో పద్మారావుగౌడ్‌కు తిరుగులేని ఆధిక్యత లభించింది. కౌంటింగ్ చివరి రౌండ్ పూర్తయ్యే సరికి పద్మారవుగౌడ్‌కు 45240 ఓట్ల ఆధిక్యత లభించింది. మధ్యాహ్నం 2.30 గంటలకు వరకు ఏదో ఒక రౌండ్‌లో ఆధిక్యత దక్కుతుందని ఆశలతో ఎదురుచూసిన ప్రత్యర్థులు, తీవ్ర నిరాశకు గురయ్యారు. రౌండ్ల లెక్కింపు ఒక్కొక్కటిగా పూర్తవుతున్న కొద్దీ బీఆర్‌ఎస్ విజయాన్ని ముందస్తుగా అంచనా వేసిన కాంగ్రెస్, బీజేపీ ఏజెంట్లు కేంద్రాల నుంచి బయటకు వెళ్లారు.

సాయన్న వారసురాలికే పట్టం..

17169 ఓట్ల మెజారిటీతో లాస్య విజయం

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్య నందిత 17169 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మొత్తం 250733 ఓట్లకు 124526 పోలవ్వగా 462 పోస్టల్ ఓట్లకు ఆరు ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. మొత్తంగా 124520 ఓట్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్య నందితకు 59057, బీజేపీ అభ్యర్థి శ్రీగణేశ్‌కు 41888, కాంగ్రెస్ అభ్యర్థి వెన్నెలకు 20826 ఓట్లు వచ్చాయి. నోటాకు 1216 ఓట్లు పోలవగా, కేవలం 517 ఓట్లతో బీఎస్పీ అభ్యర్థి బూడిద కరుణాకర్ సహా మిగిలిన ఏడుగురు అభ్యర్థులు డిపాజిట్ కోల్పోయారు.

మొదటి రౌండ్ నుంచే..

మొత్తం 17 రౌండ్‌ల వారీగా సాగిన లెక్కింపులో మొదటి రౌండ్ నుంచీ బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్య నందిత స్పష్టమైన ఆధిక్యత సాధిస్తూ వచ్చారు. తొలి ఆరు రౌండ్‌ల కౌంటింగ్ పూర్తయ్యే సరికే 1703 ఓట్ల ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. ఏడో రౌండ్ నుంచి పదకొండో రౌండ్ వరకు స్వల్ప మెజారిటీతో సాగింది. పదో రౌండ్‌లో బీజేపీకి 527 ఓట్ల ఆధిక్యత దక్కింది. 12వ రౌండ్ నుంచి కౌంటింగ్ పూర్తయ్యే వరకూ బీఆర్‌ఎస్ హవానే కొనసాగడంతో మొత్తానికి 17169 ఓట్ల ఆధిక్యంతో లాస్య విజయం సాధించారు.



ధ్రువపత్రం అందుకుంటున్న లాస్య నందిత

పుంజుకున్న కమలం..
చతికిలపడ్డ కాంగ్రెస్

2018 ఎన్నికలతో పోలిస్తే కంటోన్మెంట్‌లో బీజేపీ పెద్ద సంఖ్యలో ఓట్లను దక్కించుకుంది. 2018లోనూ బీజేపీ నుంచి పోటీ చేసిన శ్రీగణేశ్‌కు 15487 ఓట్లు రాగా, ప్రస్తుతం 41888 ఓట్లు వచ్చాయి. 2018లో కాంగ్రెస్‌కు అభ్యర్థిగా పోటీ చేసిన సర్వే సత్యనారాయణకు 28234 ఓట్లు పోలవగా, ప్రస్తుతం కాంగ్రెస్ అభ్యర్థి వెన్నెలకు 20810 ఓట్లు వచ్చాయి. 2018లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా గెలిచిన దివంగత సాయన్నకు 65797 ఓట్లు పోలవగా, ప్రస్తుతం ఆయన కుమార్తె లాస్య నందితకు 59057 ఓట్లు వచ్చాయి.

మూడవ విజయం.. తలసాని సొంతం

41827 మెజార్టీతో విజయం

సనత్‌నగర్: సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్‌యాదవ్ హ్యాట్రిక్ కొట్టారు. సనత్‌నగర్ నియోజకవర్గం ఆవిర్భావం నాటి నుంచి ఇంతవరకు వరుసగా మూడుసార్లు గెలిచిన వారు ఎవరూ లేరు. ఈ ఎన్నికలతో తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముచ్చటగా మూడోసారి విజయం సాధించి ఆ రికార్డును నెలకొల్పారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన లెక్కింపు ప్రక్రియలో భాగంగా ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించారు. మొత్తం 458 పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు బీఆర్‌ఎస్‌కు 159, కాంగ్రెస్‌కు 140, బీజేపీకి 106, ఇతరులకు 3, నోటాకు 7 ఓట్లు పడగా 43 ఓట్లు చెల్లలేవు.

చివరి రౌండ్ వరకూ ముందంజలోనే..

పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు, అనంతరం మొదటి రౌండ్ నుంచి మొదలుకొని చివరి రౌండ్ వరకు తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధిక్యాన్ని కనబరిచారు. మొదటి నుంచి చివరి వరకు రెండో స్థానంలో బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి కొనసాగుతూ వచ్చారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం 249,022 ఓటర్లు ఉండగా 128263 ఓట్లు పోలయ్యాయి. వీటిలో తలసానికి 72557, మర్రి శశిధర్‌రెడ్డికి 30730 ఓట్లు రాగా 41827 ఓట్ల మెజార్టీతో తలసాని హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసుకున్నారు. మూడో స్థానంలో



ఆర్వో కిషన్‌రావు నుంచి ధ్రువీకరణ పత్రం అందుకున్న శ్రీనివాస్‌యాదవ్

ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమ 22492 ఓట్లతో సరిపెట్టుకున్నారు.

◆ కాంగ్రెస్ పవనాల ధాటికి ప్రత్యర్థులు చిత్తవుతారని భావించి తొలిసారిగా సనత్‌నగర్ నుంచి పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమకు ఘోర పరాజయం తప్పలేదు. తొలి రౌండ్‌లోనే బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థుల కన్నా అతి తక్కువ ఓట్లు ఆమెకు రావడంతో నిరాశతో కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వెళ్లిపోయారు.

◆ పోటీలో నిలిచిన అభ్యర్థులు ఎవరూ తమకు నచ్చలేదంటూ నోటాకు వేసిన వారూ సనత్‌నగర్ నియోజకవర్గంలో అధికంగానే ఉండడం గమనార్హం. మొత్తం 1040 మంది నోటాకు నొక్కారు.

బీజేపీ కుట్రలను ప్రజలు తిప్పి కొట్టారు

రసూల్‌పురా: తనను ఓడించేందుకు బీజేపీ నేతలు మానసిక క్షోభకు గురిచేశారని ఆ కుట్రలను నియోజకవర్గ ప్రజలు తిప్పి కొట్టారని లాస్య నందిత తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచినట్లు అధికారులు అందజేసిన ధ్రువపత్రాన్ని ఆమె తన తండ్రి దివంగత ఎమ్మెల్యే సాయన్న చిత్రపటం వద్ద ఉంచి ఉద్వేగానికి లోనయ్యారు.ఈ సందర్భంగా లాస్య మాట్లాడుతూ.. తనకు ఎల్లవేళలా అండగా ఉంటూ సోదరి నివేదిత, తల్లి గీత ప్రోత్సహించారన్నారు. ఆమె ముందు ఉన్న సోదరి నివేదితను ఒక్కసారిగా ఆలింగనం చేసుకున్నారు. రాష్ట్ర బెవరేజేస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్, మార్కెట్ మాజీ చైర్మన్లు ముప్పిడి గోపాల్. టీ శ్రీనివాస్, ఎంఐఎం నాయకులు ముక్రం ఖాద్రీ, పనస సంతోష్, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు లోకనాథ్, అనితా ప్రభాకర్, పాండుయాదవ్, నళిని కిరణ్ ఇతర నాయకులు లాస్య నందితను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



తండ్రి చిత్రపటం వద్ద సర్టిఫికెట్ ఉంచిన లాస్యనందిత



భావోద్వేగానికి గురైన పజ్జన్న

ఎమ్మెల్యేగా మరోమారు భారీ విజయాన్ని అందుకుని కౌంటింగ్ సెంటర్ నుంచి బయటకు వచ్చిన డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ బోరున విలపించారు. ప్రభుత్వ వ్యతిరేక పరిస్థితులు రాష్ట్ర వ్యాప్తంగా వీస్తున్న ఈ తరుణంలో భారీ మెజారిటీ అందించిన లష్కర్ ఓటర్లకు మీరేం చెబుతారని విలేకరులు అడగుతుండగా ఒక్కసారిగా కంటతడి పెట్టారు. మరో భారీ విజయాన్ని అందించిన లష్కర్ ప్రజలను తన కుటుంబ సభ్యుల కన్నా ఎక్కువ చూసుకుంటానని హామీ ఇచ్చారు. -సికింద్రాబాద్



ఆరుగురు ఎమ్మెల్యేలు కంటోన్మెంట్ వాసులే!

కంటోన్మెంట్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన 119 ఎమ్మెల్యేల్లో ఆరుగురు కంటోన్మెంట్ వాసులే ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యేగా గెలిచిన లాస్య నందితతో పాటు సనత్‌నగర్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్, మేడ్చల్ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి నుంచి మర్రి రాజశేఖర్ రెడ్డిలతో పాటు రామగుండం నుంచి గెలిచిన మకన్ సింగ్ రాజ్ ఠాకూర్, ముథోల్ నుంచి బీజేపీ తరపున గెలిచిన రామ్‌రావు పవార్ పటేల్ కంటోన్మెంట్ వాసులే కావడం గమనార్హం. మర్రి రాజశేఖర్ రెడ్డి, మల్లారెడ్డి బోయిన్‌పల్లిలో నివాసముండగా, తలసాని శ్రీనివాస్ యాదవ్ మారేడుపల్లిలో ఉంటారు. మకన్‌సింగ్ రాజ్ ఠాకూర్ కార్ఖానా గృహలక్ష్మి కాలనీలో, ముథోల్ ఎమ్మెల్యేగా గెలిచిన రామారావు పవార్ పటేల్ తాడ్‌బంద్ టెంపుల్ రాక్ ఎన్‌క్లేవ్‌లో ఉంటారు. ఈయనపై పోటీ చేసి ఓటమి పాలైన రామ్‌రావు పవార్ సోదరుడు నారాయణ రావు పటేల్ సైతం ఇక్కడే నివాసముంటున్నారు. ఇక తిరుమలగిరి పీ అండ్ టీ కాలనీలో నివాముండే ఎమ్మెల్యే రేఖానాయక్‌కు ఈ సారి బీఆర్‌ఎస్ టికెట్ ఇవ్వకపోవడంతో, ఆమె భర్త శ్యామ్ నాయక్ ఆసిఫాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. బోయిన్‌పల్లి భావనా కాలనీలో నివాసముండే ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే జాజుల సురేందర్ తాజా ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. కంటోన్మెంట్ మాజీ ఉద్యోగి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి బాన్సువాడ నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజా మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సైతం గత ఎన్నికల్లో విజయం సాధించే వరకు కంటోన్మెంట్‌లోనే నివాసముండే వారు. వేములవాడ నుంచి బీజేపీ నుంచి పోటీ చేసిన సీహెచ్. వికాస్ రావు కంటోన్మెంట్ గన్‌రాక్ కాలనీలో ఉంటారు.

వర్సిటీలలో నియామకాలు చేపట్టాలి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపుపట్ల ఓయూ పరిశోధక విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఆదివారం ఓయూ పాలన భవనం ఎదుట బాణా సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో వర్సిటీలలో అధ్యాపకులు, బోధనేతర ఉద్యోగాలను ఖాళీలను భర్తీ చేయకుండా నియామకపు బోర్డు పేరుతో కాలయాపన చేశారని ధ్వజమెత్తారు. కొత్త ప్రభుత్వంలో ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బాయ్..బాయ్...ఓయూ వీసీ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఓయూ జేఏసీ చైర్మన్ ఓరుగంటి కృష్ణ, అశోక్‌నాయక్, కాడరి సురేష్, వినిత్, రాఘవ్, సతీష్ పాల్గొన్నారు.

నా విజయం ప్రజలకు అంకితం

రసూల్‌పురా: కంటోన్మెంట్ ప్రజలు తమ వైపే ఉండి సాయన్న బిడ్డకే పట్టం కట్టారని ఇది ప్రజల విజయమని లాస్య నందిత పేర్కొన్నారు. కంటోన్మెంట్ అంటే సాయన్న అనే బ్రాండ్ మరోసారి తన విజయంతో రుజువు అయిందన్నారు. తనపై నమ్మకం ఉంచి టికెట్ కేటాయించిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, మంత్రి తలసాని, ఇన్‌చార్జిలు, ఎంఎన్. శ్రీనివాస్, కట్టెల శ్రీనివాస్, గజ్జెల నాగేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓయూకు నూతన సీఎంను ఆహ్వానిస్తాం

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఓయూకు మాజీ సీఎం కేసీఆర్ తీరని అన్యాయం చేశారని టీపీసీసీ అధికార ప్రతినిధి, ఓయూ పరిశోధన విద్యార్థి చనగాని దయాకర్‌గౌడ్ పేర్కొన్నారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట రంగులు చల్లుకుని నృత్యాలు చేశారు. రాష్ట్ర అవతరణ అనంతరం కేసీఆర్ నిరుద్యోగుల జీవితాలను నాశనం చేయడంతో పాటు ప్రభుత్వ వర్సిటీలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. యూనివర్సిటీల సమస్యల పరిష్కారం కోసం కొత్త సీఎం ఎవరైన సరే ఓయూ క్యాంపస్‌కు తీసుకొస్తామన్నారు.

గులాబీ జోష్



అడ్డగుట్టలో సంబరాల్లో పాల్గొన్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి



భార్య స్వరూపతో ఆనందం పంచుకుంటున్న పద్మారావుగౌడ్



విక్టరీ సంకేతం చూపిస్తున్న పద్మారావు

లాలాపేట: భారీ మెజారిటీతో విజయం సొంతం చేసుకున్న సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌ను ఆ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. తనకు అప్పటికే డిప్యూటీ స్పీకర్ హోదాలో ఉన్న కాన్వాయ్‌ను అక్కడే వదిలేసి తన సొంత వాహనం ఓపెన్ టాప్ ప్రచార వాహనంపై కుటుంబ సభ్యులతో కలిసి ర్యాలీగా బయలుదేరారు. జై పజ్జన్న అనే నినాదాలతో ఓయూ క్యాంపస్ ప్రాంతాలు మార్మోగాయి. అభిమానులు క్రేన్ ద్వారా తీసుకువచ్చిన భారీ పూలమాలతో పద్మారావు గౌడ్‌ను సన్మానించారు. మాణికేశ్వర్‌నగర్, సీతాఫల్‌మండి మీదుగా పద్మారావు నివాసానికి విజయోత్సవ ర్యాలీ కొనసాగింది.

ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో..

అడ్డగుట్ట: సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా మూడోసారి విజయం సాధించి పద్మారావుగౌడ్ లష్కర్‌లో చరిత్ర సృష్టించారని కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి అన్నారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా పద్మారావుగౌడ్ 45 వేలపై మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో అడ్డగుట్ట, తుకారాంగేట్, శాంతినగర్ ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ నేతలు సంబరాలు నిర్వహించారు. అనంతరం అడ్డగుట్ట నుంచి పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చిలకలగూడ: సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు అఖండ మెజార్టీతో గెలిచిన నేపథ్యంలో గులాబీ శ్రేణులు విజయోత్సవ ర్యాలీతో సందడి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ కౌంటింగ్ సెంటర్ నుంచి వారాసిగూడ చౌరస్తా, నామాలగుండు, సీతాఫల్‌మండి, గాంధీ విగ్రహం, చిలకలగూడ చౌరస్తా మీదుగా టకారాబస్తీ వరకు ర్యాలీ కొనసాగింది.

భోలక్‌పూర్‌లో..

పద్మారావునగర్: సనత్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు భోలక్‌పూర్‌లో పవన్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో స్వీట్లు పంచి పెట్టి టపాసులు కాల్చారు. ఈ కార్యక్రమంలో వెంకటేషన్, ఏసూరి మహేష్ , డి. జనార్ధన్, వెంకట్ ముదిరాజ్, మహేందర్ గౌడ్, శ్రీనివాస్, సుధాకర్, రాంబాబు, పుష్పంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• మోండా మార్కెట్ టకారబస్తీలో బీఆర్‌ఎస్ నాయకులు ధరమ్‌రాజ్ చౌదరి, బీ. కిరణ్‌గౌడ్, యాదగిరి యాదవ్, ఇమ్రాన్ తదితరులు టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు.



టపాసులు కాల్చుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కాంగ్రెస్ ఖుష్



గౌరవపల్లి రమేష్ ఆధ్వర్యంలో బేగంపేటలో సంబరాలు

చిలకలగూడ: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించిన నేపథ్యంలో సికింద్రాబాద్ కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాగులూరి సాయి బాబా నేతృత్వంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించి చిలకలగూడ గాంధీచౌక్ వద్ద బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ అఖండ విజయం సాధించినప్పటికీ జంట నగరాల పరిధిలో ఆశించిన సీట్లు రాలేదని, సికింద్రాబాద్‌లో ఓటమి పట్ల విచారం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో తెలంగాణ ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.



నిరుపేదలకు నిత్యావసర వస్తువులు అందిస్తున్న మహ్మద్ అజ్గర్

◆ రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో రాష్ట్ర మైనార్టీ నాయకుడు దివంగత మహ్మద్ జహంగీర్ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు నిరుపేద, వితంతువులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు.



నాగులూరి సాయిబాబా నేతృత్వంలో..